క్లుప్తంగా

సంఘం ప్రధాన కార్యదర్శిగా సతీశ్

సుజాతనగర్: తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సంఘం (ఐఎన్‌టీయూసీ అనుబంధం) రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీగా, ఎన్పీడీసీఎల్ కంపెనీ పబ్లిసిటీ ఇన్‌చార్జ్‌గా సుజాతనగర్‌కు చెందిన చింతలపూడి సతీశ్ ఎన్నికయ్యారు. ఆయనకు హన్మకొండలోని సంఘం ఐఎన్‌టీయూసీ రాష్ట్ర సెక్రటరీ ఇనుగాల శ్రీధర్ సోమవారం నియామక పత్రాన్ని అందజేశారు. సతీశ్‌ను ఉద్యోగులు అభినందించారు.

మైనార్టీల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు

కొత్తగూడెంఅర్బన్: రాజ్యాంగపరంగా మైనార్టీలకు ఉన్న హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని జిల్లా మైనార్టీ సంఘం అధ్యక్షుడు ఎండీ యాకూబ్‌పాషా ఆరోపించారు. మైనార్టీ హక్కుల దినోత్సవం సందర్భంగా కొత్తగూడెంలోని సంఘం కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మైనార్టీ హక్కులపై అవగాహన కల్పించాలనే బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఉన్నా పట్టించుకోవడం లేదని తెలిపారు. అంతేకాక విద్యార్థుల ఉపకార వేతనాలను రద్దు చేస్తున్నారని విమర్శించారు. ఈ మేరకు ముస్లింలు హక్కుల సాధనకు పోరాడాలని సూచించారు. సమావేశంలో నాయకులు ఎండీ షకీల్, జాకీర్‌హుస్సేన్, అక్బర్, అలీం తదితరులు పాల్గొన్నారు.

దోపిడీని అరికట్టాలి

పాల్వంచ: ధాన్యం కొనుగోళ్లలో దళారుల దోపిడీని అరికట్టాలని ప్రజాపంథా నాయకుడు నిమ్మల రాంబాబు డిమాండ్ చేశారు. పాల్వంచలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పంట చేతికొచ్చే సమయాన అధికారులు పట్టించుకోకపోవడంతో దళారులు మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఇకనైనా అధికారులు దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు పూనెం రమేశ్, పి.సంజీవరావు, ఎం.అజయ్, మనోజ్, జోగారావు తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లు పరిశీలన

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి దినోత్సవ వేడుకల ఏర్పాట్లను ఆదివారం డీజీఎం పర్సనల్ (వెల్ఫేర్) కోడూరి శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా డీజీఎం మాట్లాడుతూ.. డిసెంబర్ 23వ తేదీన నిర్వహించే సింగరేణి వేడుకలకు సింగరేణి సీఎండీ ముఖ్య అతిథిగా హాజరవుతున్న నేపథ్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించాలన్నారు. సంస్థకు చెందిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి స్టాళ్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో డీజీఎం (సివిల్) పి.రాజశేఖర్, పర్సనల్ మేనేజర్ ముకుంద సత్యనారాయణ, పీఓ టి.శ్రీనివాసరావు, డీవైఎస్ఈ సివిల్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి భూమి విరాళం

జూలూరుపాడు: కాకర్ల శ్రీ సంతాన వేణుగోపాలస్వామి ఆలయానికి అర ఎకరం భూమిని దేవుడి మాన్యంగా దాతలు విరాళంగా ఇచ్చారు. కొత్తగూడెం విద్యానగర్ కాలనీకి చెందిన మరీది నర్సయ్య, వెంకాయమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు మరీది గంగాధర్ ఢిల్లీ ఐఏఎస్ కోచింగ్ ఫ్యాకల్టీ, సరిత ఎలక్ట్రికల్ ఏడీఈ దంపతులు, శ్రుతి, యశశ్విన్ గాంధీలు ఆలయ నిర్వహణ కోసం అర ఎకరం (20 కుంటలు) భూమిని దేవుడి మాన్యంగా ఇచ్చినట్లు ఆలయ కమిటీ సభ్యులు, శ్రీ కృష్ణ సేవా సమితి సభ్యులు సోమవారం తెలిపారు. ఆలయానికి దక్షిణం వైపు దేవుడి మాన్యం ఉందని, ఇందులో పూజకు అవసరమయ్యే పూల మొక్కలను కూడా దాతలు నాటిస్తామని చెప్పినట్లు సభ్యులు పేర్కొన్నారు.

ఎల్‌టీఆర్ కేసులు పరిష్కరించండి

ఇల్లెందు: పెండింగ్‌లో ఉన్న ఎల్‌టీఆర్ కేసులు పరిష్కరించాలని తుడుందెబ్బ రాష్ట్ర నాయకులు గొగ్గెల రామస్వామి కోరారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన కొత్తగూడెంలోని కలెక్టర్‌తో పాటు ఆర్‌డీఓకు వినతిపత్రాలు అందజేశారు. జిల్లావ్యాప్తంగా ఎల్‌టీఆర్ కేసులు పెండింగ్‌లో ఉన్నందున పరిష్కారంపై దృష్టి సారించాలని కోరారు.

రూ.9,500 వేతనం ఇవ్వాలి

జూలూరుపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లకు రూ.9,500 గౌరవ వేతనం ఇవ్వాలని బహుజన కార్మిక విభాగం (బీకేవీ) నాయకుడు తంబర్ల నర్సింహారావు డిమాండ్ చేశారు. జూలూరుపాడులో సోమవారం జరిగిన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వీపర్లు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం గుర్తించాలన్నారు. భూక్యా సాలీ, నునావత్ లక్ష్మణ్, వట్టం కృష్ణయ్య, పాయం శేషమ్మ, ప్రేమమ్మ, కవిత, సాయమ్మ, ప్రతాప్, లక్ష్మి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

జూలూరుపాడు: హైదరాబాద్‌లోని హార్ట్‌బీట్ స్వచ్ఛంద సంస్థకు జూలూరుపాడులోని ఎక్స్‌లెంట్ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆర్థికసాయం అందజేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిపి సేకరించిన రూ.8 వేలను సంస్థ బాధ్యులకు సోమవారం అప్పగించారు. పాఠశాల కరస్పాండెంట్ ఆరబోయిన కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ శారదాదేవి, హుస్సేన్‌తో పాటు అనిత, పుల్లారావు, శాంతమ్మ పాల్గొన్నారు.

సిద్ధమైన డిజిటల్ లైబ్రరీ

- నిర్మాణం పూర్తి.. ప్రారంభమే తరువాయి
- ఎప్పుడు తెరుస్తారోనని నిరుద్యోగుల ఎదురుచూపులు
- కొత్త ప్రభుత్వంలో ఉద్యోగాల భర్తీ ప్రకటనలతో ఆశలు



ఇల్లెందు జేకే ఏరియాలో సిద్ధమైన గ్రంథాలయ భవనం

ఇల్లెందు: ఇల్లెందు జేకే ఏరియాలో డిజిటల్ లైబ్రరీ నిర్మాణం ఎట్టకేలకు పూర్తయింది. ఐటీడీఏ ఇంజనీరింగ్ విభాగం పర్యవేక్షణలో నిర్ణయించిన కాల పరిధిలోనే నిర్మాణం పూర్తి చేయగా.. ప్రారంభోత్సవమే మిగిలి ఉంది. ఏడాది కిందట గ్రంథాలయ నిర్మాణ పనులు మొదలు పెట్టి అక్టోబర్ నాటికి పూర్తి చేశారు. ఇంతలోనే ఎన్నికలు రావడం, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి వరుసగా ఉద్యోగాలు భర్తీ చేయనున్నట్లు చెబుతుండటంతో నిరుద్యోగులు గంపెడాశలు పెట్టుకున్నారు. త్వరగా లైబ్రరీని ఉపయోగిస్తే పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు ఉపయోగంగా ఉంటుందని వారు చెబుతున్నారు.

ఉపయోగాలు అనేకం..

పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే నిరుద్యోగులు ఈ డిజిటల్ లైబ్రరీ ద్వారా సమాచారాన్ని సులువుగా పొందే అవకాశం ఉంది. ఆన్‌లైన్‌లో అవసరమైన సమాచారాన్ని పొందడం ద్వారా సుదూర ప్రాంతాలకు వెళ్లి రూ.లక్షలు వెచ్చించి కోచింగ్ తీసుకోవాల్సిన బాధ తప్పుతుంది. అలాగే, ఆన్‌లైన్ ద్వారా పుస్తకాలు, దిన, పక్ష, మాస పత్రికలు అందుబాటులోకి వస్తాయి. అలాంటి డిజిటల్ లైబ్రరీ సకాలంలో ఏర్పాటు చేసినట్లయితే ఎంతో మేలు జరుగుతుంది. పట్టణంలో శాఖా గ్రంథాలయాలు ఉన్నా వాటిలో ఆన్‌లైన్ సేవలు అందుబాటులో లేకపోవడం.. ఇప్పుడు లైబ్రరీ సిద్ధమైన నేపథ్యాన త్వరగా ప్రారంభించాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

విద్యుదీకరణలో జాప్యం

నూతనంగా నిర్మించిన ఈ గ్రంథాలయాలనికి విద్యుదీకరణ చేయాల్సి ఉంది. మీటర్, కేబుల్‌తో పాటు రెండు స్తంభాలు ఏర్పాటు చేయాలి. ఇందుకోసం విద్యుత్ శాఖ అంచనా రూపొందించి డిమాండ్ నోటీస్ జారీ చేస్తే నిధులు విడుదలవుతాయి. కానీ విద్యుత్ శాఖ అధికారుల జాప్యంతో ఆ పనులు ముందుకు సాగడం లేదు. ఇప్పటికే విద్యుత్ శాఖకు మీటర్, స్తంభాల కోసం విభాగం ఇంజనీరింగ్ విభాగం అధికారులు దరఖాస్తు చేశారు.

సదుపాయాలు ఇలా..

ఇల్లెందులో రూ.కోటితో నిర్మించిన డిజిటల్ లైబ్రరీలో అనేక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. రీడింగ్ హాల్, కంప్యూటర్ల గది, పుస్తకాల భద్రత కోసం ప్రత్యేక గది, దిన, పక్ష, మాస పత్రికలు చదువుకునేందుకు హాల్, లైబ్రేరియన్ కోసం గది ఏర్పాటు చేశారు. అలాగే, ఫ్యాన్లు, తాగునీరు, మూత్ర శాలలు, మరుగుదొడ్లు కూడా ఉన్నాయి.

అందుబాటులోకి తీసుకురావాలి..



డిజిటల్ గ్రంథాలయం వల్ల ఎన్నో ఉపయోగాలు ఉంటాయి. ఇల్లెందులో నిర్మాణం పూర్తయిన డిజిటల్ లైబ్రరీని త్వరగా ప్రారంభించి నిరుద్యోగులకు అందుబాటులోకి తీసుకురావాలి. ఈ విషయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారిస్తేనే ఫలితం ఉంటుంది.

–ఎ.సతీశ్, కాకతీయనగర్, ఇల్లెందు

త్వరలోనే అప్పగిస్తాం..



ఇల్లెందు డిజిటల్ లైబ్రరీ నిర్మాణం పూర్తయింది. విద్యుత్ కనెక్షన్ ఇవ్వడం మాత్రమే మిగిలి ఉంది. విద్యుత్ శాఖ నుంచి డిమాండ్ నోటీస్ కోసం ఎదురు చూస్తున్నాం. త్వరలోనే విద్యుత్ లైన్ పూర్తిచేసి మీటర్ ఏర్పాటు చేసి గ్రంథాలయ సంస్థకు అప్పగిస్తాం.

–సాలార్, ఏఈ, ఐటీడీఏ, ఇల్లెందు

మంత్రులను కలిసిన నాయకులు


టేకులపల్లి: సీతక్కకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం


పాల్వంచ: శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు

ఇల్లెందు/టేకులపల్లి: గిరిజన ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ఆదివాసీ టీచర్స్ ఫెడరేషన్ (టీఎస్ఏటీఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోకాళ్ల శ్రీనివాసరావు, కబ్బాకుల రవి కోరారు. ఈ సందర్భంగా వారు సోమవారం రాష్ట్ర మంత్రి ధనసరి సీతక్కకు వినతిపత్రం అందజేశారు. ములుగు జిల్లా మేడారంలో మంత్రిని కలిసి సంఘం నాయకులు పలు సమస్యలను విన్నవించగా ఆమె సానుకూలంగా స్పందించారని తెలిపారు. నాయకులు రమేశ్‌బాబు, అంజయ్య, కృష్ణయ్య, కృష్ణార్జున్, ఉండం నాగేంద్రరావు, కుంజ కృష్ణ, కొమరం సంతోష్, కిన్నెర నర్సయ్య, సిద్దబోయిన బిక్షమయ్య, పాయం ఆనందరావు, పీర్ల కృష్ణబాబు, సిద్దబోయిన వేణు, చుంచు రవీందర్, సుర్నపక స్వరూప, రమణ, అమల తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటిని కలిసిన నాయకులు

పాల్వంచ: రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు సోమవారం ఖమ్మంలో కలిశారు. పాల్వంచ నుంచి వాహనాల్లో ర్యాలీగా వెళ్లిన నాయకులు మంత్రిని కలిసి సన్మానించారు. కార్యక్రమంలో యర్రంశెట్టి ముత్తయ్య, నందా నాయక్, ఆళ్ల మురళి, తూము చౌదరి, తోట దేవీప్రసన్న, బాదర్ల జోషి, కందుకూరి రాము, పిట్టల రామారావు, పులి సైదులు, వజ్జల రాము, దారా చిరంజీవి, కొండం పెల్లయ్య, అనిత, నాగిరెడ్డి, గంధం నర్సింహారావు, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలి

టేకులపల్లి: బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలనే నినాదంతో జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు డిసెంబర్ 10 నుంచి జనవరి 11 వరకు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం కొనసాగుతోంది. టేకులపల్లి మండలంలోని ఆరు కాంప్లెక్స్‌ల పరిధిలోని సీఆర్‌పీలు గ్రామాల్లో పర్యటిస్తూ బడి మానేసిన, బడికి వెళ్లకుండా పనులకు వెళ్తున్న బడి ఈడు పిల్లలను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. సోమవారం మంగలితండాలో ఇద్దరు బడి ఈడు పిల్లలు స్కూల్‌కి వెళ్లకుండా కూలి పనులకు వెళ్తుండటంతో సమాచారం తెలుసుకున్న కుంటల్ల కాంప్లెక్స్ సీఆర్‌పీ భాస్కర్‌రావు వెళ్లి తల్లిదండ్రులకు, పిల్లలకు కౌన్సెలింగ్ ఇచ్చి తిరిగి పాఠశాలకు పంపించారు. ఎక్కడైనా బడిఈడు పిల్లలు స్కూల్‌కి వెళ్లకుండా పనికి వెళ్తుంటే సమాచారం ఇవ్వాలని ఎంఈఓ ఠాకూర్ రాంసింగ్ తెలిపారు.


వివరాలు నమోదు చేసుకుంటున్న సీఆర్‌పీ

భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

కొత్తగూడెంఅర్బన్: మధ్యాహ్న భోజన కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు కలెక్టరేట్ ముందు సోమవారం నిరసన తెలిపి, డీఈఓ వెంకటేశ్వరాచారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సత్తెనపల్లి విజయలక్ష్మి మాట్లాడుతూ సకాలంలో బిల్లులు చెల్లించడంతో పాటు ప్రస్తుతం ఇస్తున్న నగదు పెంచాలని కోరారు. కార్యక్రమంలో మంగ, విజయ, సరోజ పాల్గొన్నారు.

శంకరమఠంలో ఎమ్మెల్యే పూజలు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని శంకరమఠంలో సోమవారం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రత్యేక పూజలు చేశారు. మఠంలోని శ్రీచక్రయంత్ర సహిత శ్రీలలిత పరమేశ్వరి దేవిని దర్శించుకున్నారు. మఠ గురువు కొచ్చర్ల సురేశ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. సాబీర్‌పాషా పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన మున్సిపల్ పాలకవర్గం

కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, కౌన్సిలర్లు సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కూనంనేని ఎమ్మెల్యేగా గెలిచాక పాలకవర్గ సభ్యులు కలవడం ఇదే తొలిసారి. వైస్ చైర్మన్ దామోదర్, కౌన్సిలర్లు ధర్మరాజు, పరమేశ్, వేముల ప్రసాద్, అంబుల వేణు, గోపాల్, బండి నర్సింహారావు, రుక్మాంగధర్ బండారి పాల్గొన్నారు.


పూజల అనంతరం గురువుతో ఎమ్మెల్యే

కూనంనేనికి సన్మానం

టేకులపల్లి: కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుని సీపీఐ మండల కార్యదర్శి గుగులోత్ రాంచందర్‌నాయక్ ఆధ్వర్యాన నాయకులు సోమవారం కలిశారు. అసెంబ్లీలో ప్యానెల్ స్పీకర్‌గా కూనంనేని నియామకంపై హర్షం వ్యక్తం చేస్తూ ఆయన్ను సన్మానించారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ

పాల్వంచ: ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి భగవద్గీత కంఠస్థం పోటీల్లో పాల్వంచ కేటీపీఎస్ డీఏవీ పాఠశాల విద్యార్థిని కె.లాస్య ప్రథమ బహుమతి అందుకుంది. ఈ సందర్భంగా సోమవారం పాఠశాల ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమెను ప్రిన్సిపాల్ ఎ.రామారావు, తెలుగు ఉపాధ్యాయురాలు వి.శశికళ అభినందించారు.

అయ్యప్ప మాలధారుల ఇరుమడి

జూలూరుపాడు: మండలంలోని కొమ్ముగూడెం శ్రీపెద్దమ్మతల్లి ఆలయంలో సోమవారం అయ్యప్పమాలధారుల ఇరుముడి కార్యక్రమం ఘనంగా జరిగింది. గురుస్వామి బోడా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మాలధారులకు ఇరుముడి కట్టగా శబరిమలై బయలుదేరారు. కార్యక్రమంలో సర్పంచ్ బానోతు శాంతిలాల్‌తో పాటు మాలధారులు అజ్మీరా బాలు, భూక్యా కిషన్‌రావు, భూక్యా బాబీ, బానోత్ సాయి, భూక్యా సక్రం, నునావత్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమమే సీఐటీయూ లక్ష్యం

ఇల్లెందు: సింగరేణి కార్మికుల పక్షాన, వారి సంక్షేమ కోసం రాజీలేని పోరాటం నిర్వహిస్తున్న ఏకైక సంఘం సీఐటీయూ మాత్రమేనని ఆ సంఘం నాయకుడు రాజారావు తెలిపారు. ఇల్లెందులోని సింగరేణి ఎస్ అండ్ పీసీలో సోమవారం జరిగిన పిట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. నీతి, నిజాయితీకి మారుపేరైన సీఐటీయూ నిరంతరం కార్మికుల పక్షాన రాజీలేని పోరాటాలు నిర్వహిస్తోందని చెప్పారు. సమావేశంలో నాయకులు అబ్దుల్ నబీ, అబ్బాస్, కోసూరి రమేశ్, శంకర్, కృష్ణ, కిరణ్, రాందాస్, హుస్సేన్, గోబ్రియా, వైకుంఠం, కేశవ్, శ్యామ్‌లోథ్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు విఫలం

జూలూరుపాడు: ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలు పరిష్కరించడంలో విద్యాశాఖ అధికారులు విఫలమయ్యారని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ విమర్శించారు. మండలంలోని పడమటనర్సాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆయనతో పాటు నాయకులు సోమవారం సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం మన ఊరు – మన బడి ద్వారా చేపట్టిన పనులు పూర్తికాకపోయినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇకనైనా అధికారులు స్పందించకపోతే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. నాయకులు గుగులోత్ అఖిల్, సాయి, రామ్‌చరణ్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

మహిళలకు క్రీడాపోటీలు

ఇల్లెందు: సింగరేణి దినోత్సవం సందర్భంగా మహిళా ఉద్యోగులకు సోమవారం క్రీడాపోటీలు నిర్వహించారు. ఇల్లెందు ఏరియాలోని సేవా సమితి సభ్యులకు నిర్వహించిన పోటీల్లో పలువురు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో విజేతలకు 23వ తేదీన సింగరేణి డే వేడుకల్లో బహుమతులు అందజేయనున్నారు. కార్యక్రమంలో సాయి స్వరూప్, సింగరేణి ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం సుధాకర్, సాంబయ్య, విజయ పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు అమలవుతాయి..

- ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య
- లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందురూరల్: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించిన ఆరు గ్యారంటీలు తప్పక అమలవుతాయని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య స్పష్టం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల, పట్టణ పరిధిలోని 97 మంది లబ్ధిదారులకు సోమవారం ఆయన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. ఆరింట్లో ఇప్పటికే రెండు గ్యారంటీలు అమలుచేస్తుండగా, గృహలక్ష్మి పథకాన్ని సంక్రాంతి నుంచి ప్రారంభిస్తున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారని తెలిపారు. గత ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను కాగితాలకే పరిమితం చేయడంతో ప్రజలు ఓటుతో సమాధానం చెప్పారని తెలిపారు. కాగా, ఎప్పుడు ఎవరికి సమస్య ఉత్పన్నమైనా నేరుగా తనను కలవొచ్చని, ఎలంటి అడ్డంకులు ఉండవని తెలిపారు. అధికారులు సైతం పైరవీలకు అవకాశం లేకుండా ప్రజల విన్నపాలను సత్వరమే పరిష్కరించాలని కోరారు. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, జానీపాషా, ఎంపీపీ చీమల నాగరత్నమ్మ, వైస్ ఎంపీపీ దాస్యం ప్రమోద్ కుమార్, డీసీసీబీ డైరెక్టర్ జనగాం కోటేశ్వరరావు, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ బాలరాజు, ఎంపీఓ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

మండలంలోని గ్రామపంచాయతీల కార్యదర్శులు సోమవారం ఎమ్మెల్యే కోరం కనకయ్యను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధికి కార్యదర్శులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఎంపీపీ చీమల నాగరత్నమ్మ, సర్పంచ్‌లు కల్తీ పద్మ, పాయం స్వాతి, పాయం లలిత, తాటి చుక్కమ్మ, భాగ్యమ్మ, ఎంపీటీసీ సభ్యులు పూనెం సురేందర్, పాయం కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో ముక్కోటికి ఏర్పాట్లు

పాల్వంచ: పట్టణంలోని దశావతారాల శ్రీసీతారామాలయంలో ఈ నెల 23వ తేదీన జరిగే ముక్కోటి ఏకాదశికి ఏర్పాట్లు చేయాలని ఈఓ రజినీకుమారి సూచించారు. ఆలయ ప్రాంగణంలో సోమవారం ఆమె ఆలయ కమిటీ బాధ్యులతో సమావేశమై మాట్లాడారు. ఆలయానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. సమావేశంలో చలవాది ప్రకాశ్, దోమల కిశోర్, బచ్చు శ్రీనివాస్, మాలే రాజేశ్, రామ్‌కుమార్, అర్చకులు గోపాలాచార్యులు, కాశీ, శివ పాల్గొన్నారు.


ఏర్పాట్లపై మాట్లాడుతున్న ఈఓ రజినీకుమారి

బీఎంఎస్‌ను ఆదరించండి


కార్మికులతో మాట్లాడుతున్న బీఎంఎస్ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో జరుగుతున్న అవినీతిని అడ్డుకోవడంతో పాటు కార్మికుల హక్కుల సాధన కోసం కృషి చేసే బీఎంఎస్‌ను గుర్తింపు సంఘం ఎన్నికల్లో గెలిపించాలని బీఎంఎస్ జాతీయ నాయకుడు కొత్తకాపు లక్ష్మారెడ్డి విజ్ఞప్తి చేశారు. కొత్తగూడెం ఏరియా పరిధిలో సోమవారం ఎన్నికల ప్రచారం చేసిన ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఇన్నాళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్.. సింగరేణిలో నిధులు దుర్వినియోగం చేయగా తాము అడ్డుకున్నామని తెలిపారు. అలాగే, బొగ్గుగని కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందం సాధించడంలో కీలకపాత్ర పోషించామని చెప్పారు. కార్యక్రమంలో బీఎంఎస్ నాయకులు మాధవ్‌నాయక్, పవన్‌కుమార్, మొగిలిపాక రవి, టి. నరేంద్రబాబు, మహేశ్‌కుమార్, జీవీ.కృష్ణారెడ్డి, నాగప్రసాద్, సంగం చందర్, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

సంఘం పేరు దుర్వినియోగం

కొత్తగూడెంఅర్బన్: ప్రత్యేక తెలంగాణ సమరయోధుల సంఘం పేరును కొందరు దుర్వినియోగం చేస్తున్నారని అధ్యక్షుడు వి.శాంతిరాం తెలిపారు. కొత్తగూడెంలోని సంఘం కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు.. అనుమతి లేకుండా లెటర్‌ప్యాడ్‌పై సంఘంలోని నాయకుల పేర్లు ముద్రించి ఉపయోగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా, కొత్త ప్రభుత్వంలోనైనా నిజమైన ఉద్యమకారులను గుర్తించి న్యాయం చేయాలని విన్నవించారు. సభ్యులు చింతలచెరువు గెర్షోము, వెంకటేశ్వర్లు, అనంతరెడ్డి, వెంగళ కనకయ్య, దూడల బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న శాంతిరామ్

బధిరుల సమస్యలపై నిరసన


నిరసన తెలుపుతున్న బధిరుల సంఘం నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో బధిరులు ఎదుర్కొంటున్న సమస్యలు తీర్చాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట జిల్లా బధిరుల సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు జి.రామలింగారెడ్డి, ప్రధాన కార్యదర్శి మణికంఠ అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. బధిరుల సంఘం కార్యాయానికి స్థలం కేటాయించడంతోపాటు భవన నిర్మాణానికి ఆర్థిక తోడ్పాటు అందించాలని, ఎలాంటి ఇబ్బందుల లేకుండా గ్రామ, మండలాల వారీగా సదరమ్ క్యాంపులు ఏర్పాటుతో పాటు పలు సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రంలో కోరారు.

వీధి వ్యాపారులకే ప్రాధాన్యత

ఇల్లెందు: రోడ్ల వెంట చిరువ్యాపారాలు చేసుకునే వారి కోసం ప్రభుత్వం వ్యాపార సముదాయాలు నిర్మించిందని, అందులో బినామీలకు చోటు ఇవ్వొద్దని ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదేశించారు. ఇల్లెందులోని మెయిన్‌రోడ్ హైస్కూల్ వద్ద నిర్మించిన వీధి వ్యాపారుల సముదాయాన్ని ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు సోమవారం పరిశీలించారు. కొందరు రాజకీయ పలుకుబడితో షాపులను ఆక్రమించుకుని ఇతరులకు కిరాయికి ఇచ్చినట్లు తెలిసిందన్నారు. ఇకనైనా వారు తప్పుకుని చిరువ్యాపారులకు న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. మున్సిపాలిటీ మేనేజర్ అంకుషావలి, ఆర్ఐ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు


ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

జూలూరుపాడు: మండల కేంద్రంలోని శ్రీకోటమైసమ్మ తల్లి ఆలయ 12వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి విగ్రహానికి అర్చకులు నేరళ్లకుంట శ్రీనివాసశర్మ ఆధ్వర్యాన కృష్ణమూర్తి, మాదిరాజు సాయికృష్ణశర్మ అభిషేకం, నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యాన అన్నదానం చేయగా, సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహంతో ఊరేగించారు.